# నిదర కలత

"ఈర ఏసాలేసి ఈరు డనిపించుక ఈరసొరగానికె పోయినావో, ఓ గుర్రాల గోపిరెడ్డి నీగీటేమో సూడనవునా"

"ఎహె! ఎహె! దినమూ గారాబ మయితే ఎట్టా? రా ఈతలికి! ఆళ్ల తోటతో నీకేం పనీ! ఈపు సెద్దుండా బుద్ధుం డక్కర్లా?"

మిగతా నలభైతొమ్మిదిమంది ఒకెత్తూ, ఆ గేడి కొమ్ముల మాలచ్చి ఒకెత్తూ. కోడెదూడ్ల కుటుంబానికి సంబంధించిం దవటాన "ఎంత గారాబమైతే మటుకు, పైపలారాలు ఎక్కువై పద్దాక దొంగతిండికి యగడ్తుంటే నామర్దా ఓడికీ? తోటిమంద దార్న తోటిగా పోతుంటె, ఏందో మాపని వుండట్టు ఆళ్ల తోటకాడే తారెట్టాడటం దేనికీ? అస లా సుబ్బిముండ వూరకుంటదా! ఆ ఏనాద్దాటేందో తెలవక్కర్లా?"

అసలు గోపాయికి తన ఆవులమందంటే సెద్ద పానాబిమానం. బడి ఎగ్గొట్టి మందలెంట పోతుంటే, పంతులోడు నాగమల్లెబెత్తాలు ఆవజాన ఒంటి మీన యిరుత్తుండా, మందమీన మనసు మల్లలా. సిలక, పచ్చి, గెద్ద, బెమ్మ, వీస్పెరుడూ, ఇయ్యన్నీ పలకనొల్లగాకుంటే పంతులోడు కొట్టటం అటుంచి, పక్క పిల్లెదవలు విడిగాకొడ్తుంటే, సాటున సూసి ఒక్కోయదవను బడ్తబెట్టి తంతే, ఒల్లు వూనం వూనం సేసి బల్లోనుంచి సాగ నంపినా తనకేం సీమకుట్టినట్టు కూడా వుండలా. తనమాటంటే మందకు గురి. ఆటిని తను అరదం సేసుకోగలడు. ఎపుడన్నా కోపాన కేకలేత్తే, అలకలంటా ముట్టిలు నాక్కుంటా ఓ దాని కోటి సాటు సేసుక ఓరకన్నుల సూత్తా ముద్దులు కురిపిత్తయి. గీతగీసి గుడుగుడు బల్ సెడుగుడు అంటమే సాలు, బసవడూ, కొండడూ, నందులూ, తోకలెత్తుక చెంగనాలేత్తా, వుఁయ్, వుఁయ్, వుఁయ్, అంటా కూతల్లే గురకపెడ్తా. అంతా కల్చి అటూ ఇటూ లగెత్తుకుంటా ఆడుకుంటంటే తనకింకో పెపంచకంతో పనక్కర్లా. కోడెదూడల గోపాయని, కోతి గోపాయని, తనకు మందతోటే సరని, తన్నంటందేనికీ? మొదులు ఈమాలచ్చింకి నోరు గుల అనగందే! ఆ యానాద్దాని తోటలోనే వున్నయ్యెట్టా పరమాన్నాలన్నీ? పానీ పెద్దముండ పోయిందే అనుకో, తనుమటుకు కాత్తె మెతగ్గా పో నక్కర్లా? ఆదుకోను రాబొయ్యాదుకూడా, సేత గానోళ్లు తోటసాయల కెందుకు రావాలా?

ఆదావిధంగా మిడిసిపడ్తంటే నాకేం సెవుల్లేవూ? దీని ఏనాది యవారమేందో మొదలంట సూడక్కర్లా?

సదువు సంగతేందో తేలిపోటాన, గొడ్డకాడే పడి సావమని అయ్య సెప్పినాక, పరాయిసోట్లకు పెంటకట్టను పెద్దమందలు పోగా, మిగతా ఇంటికాడ కరుజుగ్గాను మిగల్న సిన్న మంద గోపాయి ముద్దుకు చరీపోయింది.

ఏదెట్టున్నా ఆ మామిడితోట అంకాయి కూతురు సుబ్బితో వచ్చింది సావు. తనోపక్క దిబ్బలమీన సెట్టుకింద కూకుని, మంద నెమరేత్తుంటే, సల్లగా ఆ పదాలు యీ పదాలు పాడుకుంటుంటే, తోటనుండి తనుకూడా ఎక్కిరిత్తా పాట్టం దేనికీ? మందసాయకు రానీ నడ్డి విరుగుద్ది!

"గేడి కొమ్ములా మాలచ్చింవికి
గెంతులేసే వగలదూడ
గెజ్జలున్నా తిరుపతమ్మకు
గల్లుమనే మువ్వలదూడ
గాజుకన్నులా గంగారమ్మకు
నాజూకైనా నిగలదూడ.
ఓ కోల మొగమూ
పిట్టనడుమూ
పైడి బిగువూ
మట్టె మీటలా
నాత్తె మాడే
వుబు కుబుకుల పిల్లా!
సెయిగలిపి సిందులేసుతా
దూడలెంటా దూకిపోదామా".

"యాడ నేర్చావయ్యా యీ పదాలూ?"

ఓసి దీనికడు పుడకా, రానే వచ్చింది, ఓ పచ్చి మాయిడికాయ కొరుకుతా ఒయ్యారంగా.

"పదాలు మాజోరుగా యిసుర్తున్నావే?"

"నీకేం యిసురుకుంటే? ఫో"

"పోటానికి నూ సంపాయించావా ఈ సోటూ?"

"నూ సంపాయించావా?"

"తగు వాదాల నుందా?"

"నువ్వే తగు వాద్తుండావు."

"మొదులు నా వూసెందుకు నీకూ?"

"పదాలు బాగుంటే యింటానికొచ్చా, తప్పా?"

"వూఁ తప్పులా, తోటకాదుండి కొక్కిరిత్తా, కోతల్లే?"

"నువ్వే కోతివి, నువ్వే కొండముచ్చువు కావాఁలు."

"ఆఁ రోజూ అంటల్లా, యియ్యాల కొత్తేముందీ? మాలచ్చిని సావనూకీ - ఆడగూతురికి అంత పొగురుం దక్కర్లా."

"ఓమ్మో, ఓమ్మో! మాలచ్చిని సావ నూకానూ? ఎంతన్నాయం. అందుగ్గాదూ కోతినంటా? లేకుంటే పతిరోజూ ఆవజాన ఎగబడి సిన్న సిన్న మొక్కలంతా యిరగ దొక్కుతుంటే, తోటోళ్ళ గతేంగానూ? కాత్త బెదురు పెడ్తే సావకొట్టినట్టేనా లెక్కా?"

''ఏమో ఎవుడు నూశాడూ మాలచ్చి ఆవజాన ఎగరొవ్వుతా వత్తే యామనుకోవాలా?"

"ఏం అనుకోకుంటానికి తోట మట్టినా కొట్టక పోవాలంటావు?"

"తోటసంగతి ఓడికి కావాలా, నన్ను మటు కంటల్లా మాటలూ?"

"ఏమన్నారయ్యా, సిన్న పిల్లాడల్లే ముద్దులు కుడుత్తుండావూ?"

"నూ పెద్దదానివి కాబట్టేగా ఆమాట యీమాట అంటం?"

"నూ మటుకు పాల్దాగుతుండావా? అన్నీ తెలుసు నీకూ."

ఆడనే కూకుంది సెట్టుసాటుగా మాయిడికాయ కొరుకుతా. ఏందో తిరుగుడుగా వుందిగాని, అదేందో అంతు పట్టటంలా. తనికీసేసి సూత్తే తన్ను తిట్టుద్దనే యవారంగా ఆపట్టల్లా. అసలు కతేందీ?

"మాయిడికాయ తింటా, ఇత్తానూ?"

"నువ్వే తిను, నాకేం అక్కర్లా."

"ఎందుకయ్యా అంత కోపం? ఎవురే మన్నారూ?"

"ఆఁ, ఏమన్లా, రోజు ఆవజాన ఏడిపిత్తా?"

"నీకు కోపం రాకుంటే, ఎందుకొత్తాను యీడకూ? నువ్వేందో, నీగోలేందో, పక్కమడుసుల సంగతేందో కనుక్కోనక్కర్లా? ఎన్నాలయ్యా ఈ గారాబం?"

"వుప్పుడు, నూ నన్ను గారాబం సేత్తుండా వెట్టా?"

"పోరా నీకసలు తెలువదు! ఓ పాట పాడు. బాగా పాడ్తావే! ఇందాకేందీ

మంచిపాట పాడ్తుండావూ?"

"ఎందుకమ్మా కొక్కిరియ్యనా? నే పాడను ఫో."

"నేనేం అననుగా. కాత్తె పాడ్తే, ఇంతలో ఏం తింటారయ్యా నీదీ?"

"నిన్ను నమ్మిందెవుడూ! ఆవజాన తిట్టీ? నే గొడ్డకు నీలుబెట్టి ఇంటికి పోవాలి, ఫో."

"ఆఁ, కూకోపెట్టీ జడేసి పూలుదోపుతా రా!" మూతిముడుసుక లెగిసి గబగబపోయింది. మందను నీలుతాపి, ఆడీడ మేపుకుంటా, కొంపకు సేరుకుని ఆ రేతిరి కలత నిదర పొయ్యాడు గోపాయి.

* * *

మరసనాడు.........

మామిడిపిందెలు పండవొచ్చే

మామడికొమ్మలు నేలకొరిగే

మామిడోళ్ళ పిల్లా పళ్ళు ఏసుక పగలబడే

ఓ మామిడోళ్ళ సిన్ని కూతుర

మామిడిపళ్ళకు మనసు తెలసెనే.

తోటకాడికి వచ్చేతలికి, టపీమని ఓ మాయిడికా యొచ్చి ఈపున గుద్దుద్ది. కంచెపక్క సెట్టుమీనగా కూకుని సుబ్బి పచ్చిలా కిలకిల నవ్వుతుంటది.

"ఏందా ఒల్లుపొగరూ, మళ్ళీ నిన్ను కొడ్తే?"

"ఆఁ కొట్టావులే సప్పట్టు. మరా పాటేందీ?"

"నీకేం పాడుకుంటే, నువు ఇంటావని కల గన్నానా?"

(కిలకిలమంటా) "ఎందుకయ్యా అట్ట బయపడి సత్తావూ నేనంటే? తమాశకంటాగాని, నువంటే పానంగాదూ! సెట్టుమీన కొత్తే ఓ దోరపండు మంచిదిత్తా, వత్తావా?"

"నే రానమ్మా."

"ఏం చెయ్యన్లే, రా రా, మంచి పండుంది కోద్దాం!"

"ఏమో నిన్ను నమ్మిం దోడూ!"

"పొనీలే యింతేకదూ!"

"మరి యాడుందీ పండూ?"

"ఈడ ఈకొమ్మ నుందిరా, కోసుకుని ఈడెనే తిందాం సప్పున రారా!"

గబగబ గొడ్డను ఆకుప్పలెంటా ఈకుప్పలెంటా తోలేసి కంచెదాటి సెట్టు మీనకెక్కి–

"యాడమ్మా పండూ?"

"ఏ పండూ?"

"మాయిపండు కొమ్మనుందంటివే! ఎందుకమ్మా యిట్టేడిపిత్తావూ?"

"యాడవకురా, పసిపిల్లోడల్లే! ఎన్నాలురా నీ కింకా ఈ గారాబం, పెద్దాడివి కావటల్లా?"

"అబద్దాలాడీ, నాకు తెలవదూ నమ్మకూడదనీ."

"వుండరా. అబద్దం కాదురా. అదుగో ఆ కొమ్మ సివర్నా; నువ్వీ దోటీ పట్టుకలాగూ, నే అందుకుని కోసిత్తానూ, అంత ఒడుదుడుకవుతే ఎట్టా?"

దోటి తీసుక కొమ్మ కేసి లాగి పట్టుకుంటే, జాగరత్తగా పాకి పడకుండా కోసుక తెచ్చింది.

"సూశావా ఎంత మంచి పండో! ఈ కొమ్మ మీన కూకుని తిందాం."

"ఇట దే, నే కోసిపెడ్తా, నా కాడ ముల్లుకత్తి వుంది."

"నీ ఒల్లు ఇంత కాల్తున్నదేరా?"

"ఏమో నాకేం తెల్చా, ఆ దంతేలే."

"సరేగానీ, ఓ పదం పాడవూ?"

"నూ పాడరాదూ?"

"యిద్దరం పాడ్దాం, ఏం?"

"ముందు నూ పాడ్తావా?"

"ఆ, ఇక్కడకాదు, కిందికిదిగీ ఆ దుబ్బులా గుండలా పాదా? అందులో ఎంత సల్లగావుంట దనుకుండా? దిగు సూపిత్తా ఎంత బాగుంటదో."

* * *

మంద మందంతా గోపాయిని ఎదుకుతా తోటలో జొరబడ్డయ్. యాడ నుంచి సూశాడో ఎంకడు, పెద్ద కఱ్ఱోటి తీసుక, ఒక్కోదాన్ని బాత్తుంటే, ఓ దారంటూ తెలవక మంద మందంతా ఆపొదమీన నజ్జునజ్జుగా లగెత్తినై....

ఒక రేత్తిరేల పక్కమీన కూకుని పెద్దపెట్టున ఏడుత్తుంటే, ఆళ్ళమ్మ ఈపు సరిచి బెదురుపోగొట్టినా, దదుపుజరాన, ఓ నెలరోజులు పడుకున్న మంచంలోంచి లెగవలా గోపాయి.